నమస్తే తెలంగాణ

వికారాబాద్

13 | హైదరాబాద్, శుక్రవారం 9 ఫిబ్రవరి 2024 | VIKARABAD




## సీపీఆర్‌పై నేటి నుంచి గాంధీలో ఉచిత శిక్షణ

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 8 : కండ్లెదుటే గుండె పోటుకు గురైన వ్యక్తిని రక్షించేందుకు సికింద్రాబాద్ లోని గాంధీ మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థులు సీపీఆర్‌పై శిక్షణ ఏర్పాటు చేశారు. కళాశాల అలుమ్ని భవనంలో శుక్ర, శనివారాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచితంగా సీపీఆర్‌పై శిక్షణ, అవగాహన కల్పించనున్నట్లు గాంధీ అలుమ్ని సంఘం అధ్యక్షుడు డాక్టర్ జీఆర్ లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ ఏవీ.రత్నం తెలిపారు.

## ఎయిర్‌పోర్టులో మెట్రో డిపో !

సిటీబ్యూరో, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ) : మెట్రో రెండో దశ సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 7 మార్గాల్లో 70 కి.మీ మేర నిర్మించాలని ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో హైదరాబాద్ మెట్రో అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే మొదలు పెట్టారు. రెండు కన్సల్టెన్సీ సంస్థలతో వేర్వేరుగా ప్రతిపాదిత మార్గాల్లో ట్రాఫిక్ సర్వేతో పాటు భూ పరీక్షలు, స్టేషన్ల నిర్మాణం, మెట్రో రైళ్లు నిలిపేందుకు అవసరమైన డిపోల స్థలాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. రెండోదశ మెట్రో కీలకమైన మెట్రో కారిడార్‌లో నాగోల్ నుంచి ఎల్‌బీనగర్ మీదుగా చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు లోపలి వరకు మెట్రో మార్గాన్ని నిర్మించాల్సి ఉన్నది. దీంతో ఈ మార్గంలోనే ఒక మెట్రో డిపోను నిర్మించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. దానికి అనుగుణంగా స్థల లభ్యతపై మెట్రో అధికారులు జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అధికారులతో సంప్రదింపులు జరుపగా, అవసరమైన స్థలాన్ని మెట్రో డిపో కోసం ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలిసింది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మెట్రో రైళ్లను నడపాలంటే కనీసం రెండు మెట్రో డిపోల అవసరం ఉంటుందని మెట్రో అధికారి ఒకరు తెలిపారు. మెట్రో డిపోను ఏర్పాటు చేయాలంటే కనీసం 40-50 ఎకరాల స్థలం అవసరమని, ఆ స్థాయిలో భూముల లభ్యతను ఇతర కారిడార్లలో అన్వేషిస్తున్నామని తెలిపారు. రెండో దశ మెట్రో డీపీఆర్‌ను మరో నెలలో ప్రభుత్వానికి అందజేసే అవకాశం ఉందని తెలిపారు.

# నేడే బల పరీక్ష

**ఆదిబట్ల మున్సిపాలిటీలో అవిశ్వాస సమావేశం**

**కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్‌ను గద్దె దింపేందుకు సొంత పార్టీ కౌన్సిలర్ల కుయుక్తి**

**విప్ జారీ చేసిన కాంగ్రెస్..**

**చైర్మన్ పదవిని ఆశిస్తున్న మర్రిని పార్టీని సస్పెండ్ చేసిన అధిష్ఠానం**

**ఆసక్తి రేపుతున్న ఆదిబట్ల రాజకీయం**

**జనంలో ఉత్కంఠ**



అవిశ్వాస సమావేశం కోసం చేసిన ఏర్పాట్లు

రంగారెడ్డి, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ) : ఆదిబట్ల మున్సిపాలిటీలో రసవత్తర రాజకీయం నడుస్తున్నది. ఆదిబట్ల మున్సిపల్ చైర్ పర్సన్‌పై సొంత పార్టీకి చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్లు తిరుగుబాటును ప్రకటించారు. ఇందుకు బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన కౌన్సిలర్లు కూడా మద్దతు పలికి క్యాంపునకు వెళ్లారు. అవిశ్వాసంపై గుర్రుగా ఉన్న కాంగ్రెస్ అధిష్ఠానం ఆ పార్టీ కౌన్సిలర్లకు విప్‌ను జారీ చేయడంతోపాటు చైర్మన్ పదవిని ఆశి స్తున్న మర్రి నిరంజన్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. అయినప్పటికీ మర్రి వెనక్కి తగ్గకపో వడం..ఈ క్రమంలో కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకునే నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది.

**ప్రిసైడింగ్ అధికారిగా ఇబ్రహీంపట్నం ఆర్డీవో ..**


ఆదిబట్ల మున్సిపాలిటీలో మొత్తం 15 మంది కౌన్సిలర్లు ఉండగా.. కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు, బీఆర్‌ఎస్‌కు చెందిన ఆరుగురు, బీజేపీకి చెందిన ఒక్క కౌన్సిలర్ మొత్తం 13 మంది కలిసి కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానాన్ని అందజేశారు. ఈ మేరకు అవిశ్వాసంపై శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రిసైడింగ్ అధికారిగా ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి వ్యవహరిస్తున్నారు. అవిశ్వాస తీర్మానం ప్రకటించిన నాటి నుంచే చైర్మన్ పదవిని ఆశిస్తున్న మర్రి నిరంజన్‌రెడ్డి నేతృత్వంలో మిగిలిన కౌన్సిలర్లంతా రహస్య క్యాంపులోనే ఉన్నారు. శుక్రవారం జరిగే బల పరీక్ష సమయానికి అందరూ క్యాంపు నుంచి నేరుగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశ మందిరానికి చేరుకోనున్నారు.

**వెనక్కి తగ్గని మర్రి..**

ఆదిబట్ల మున్సిపాలిటీలో మర్రి నిరంజన్‌రెడ్డి 9వ వార్డు కౌన్సిలర్‌గా ఉన్నారు. గతంలో చైర్మన్ పదవికోసం పోటీపడగా.. అనూహ్యంగా కొత్త ఆర్తికను వరించడంతో మర్రికి పదవి చేజారింది. ఈ క్రమంలోనే గతేడాది కాలంగా కొంతమంది కౌన్సిలర్లు అసంతృప్తిగా ఉన్నారు. దీన్ని అవకాశంగా తీసుకుని మర్రి చక్రం తిప్పి సొంత పార్టీ చైర్‌పర్సన్‌పైనే అవిశ్వాస తీర్మానాన్ని పెట్టించారు. ఈ తీర్మానంపై స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అసంతృప్తిగా ఉన్నారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న కాంగ్రెస్ పెద్దలు ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లకు విప్‌ను జారీ చేయడంతోపాటు మర్రి నిరంజన్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అయినప్పటికీ నిరంజన్‌రెడ్డి ఏమాత్రం తగ్గినట్లుగా కనబడడం లేదు. ఎవరికీ టచ్‌లోకి రాకుండా అవిశ్వాసం ప్రకటించిన కౌన్సిలర్లతో రహస్య క్యాంపులోనే ఉన్నారు.

**కాంగ్రెస్ నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ..**

చైర్మన్ పదవిని ఆశిస్తున్న మర్రి నిరంజన్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటారా..? అన్నది సందేహంగా మారింది. ఒకవేళ విప్‌ను ఉల్లంఘించి సొంత పార్టీకి చెందిన చైర్‌పర్సన్ కొత్త ఆర్తికను గద్దె దించితే కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుం టుందనేది చర్చనీయాంశంగా మారింది. విప్‌ను ధిక్కరించిన వారిపై తక్షణం అనర్హత వేటు వేయక పోతే.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులుగా ప్రకటించే అధికారం ఎలక్షన్ కమిషన్‌కు ఉంటుంది. ఈ పరిస్థితుల్లో అవిశ్వాస రాజకీయం ఎటు మలుపుతిరుగుతుందో వేచి చూడాల్సిందే.



**వికారాబాద్ జిల్లాలో మొత్తం ఓటర్లు ఇలా..**

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| పరిగి | 1,33,625 | 1,32,639 | 9 | 2,66,273 |
| వికారాబాద్ | 1,15,019 | 1,16,647 | 13 | 2,31,679 |
| తాండూరు | 1,18,228 | 1,25,614 | 7 | 2,43,849 |
| కొడంగల్ | 1,19,237 | 1,23,020 | 10 | 2,42,267 |
| మొత్తం | 4,86,109 | 4,97,920 | 39 | 9,84,068 |

# పెరిగిన ఓటర్లు

### ఉమ్మడి జిల్లా ఓటరు తుది జాబితా విడుదల

**రంగారెడ్డి జిల్లాలో మొత్తం ఓటర్లు 35,91,120 మంది..**

**వికారాబాద్ జిల్లాలో 9,84,068 మంది..**

రంగారెడ్డి, ఫిబ్రవరి 8(నమస్తే తెలంగాణ): ఓటరు తుది జాబితా గురువారం విడుదలైంది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం విడుదల చేసింది. దాని ప్రకారం రంగారెడ్డి జిల్లా మొత్తం ఓటర్లు 35,91,120 మంది ఉండగా.. అందులో పురుషులు 18,50,292 మంది, స్త్రీలు 17,40,379 మంది,ఇతరులు 449 మంది, ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 286 మంది, సర్వీస్ ఓటర్లు 581 మంది ఉన్నారు. అదేవిధంగా వికారాబాద్ జిల్లాలో మొత్తం ఓటర్లు 9,84,068 మంది ఉండగా .. పురుషులు-4,86,109 మంది, మహిళలు-4,97,920 మంది, ఇతరులు 39 మంది ఓటర్లు ఉన్నారు. అయితే జిల్లాలో మహిళా ఓటర్లే అధికంగా ఉండడం గమనార్హం. పరిగి నియో జకవర్గం మినహా వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. పరిగి నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లుండగా.. వికారాబాద్ నియో జకవర్గంలో అత్యల్పంగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే జిల్లాలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. ఓటరు ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 9,71,011 మంది ఓటర్లుండగా, తుది జాబితా ప్రకారం 9,84,068 మంది ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు నవంబర్ 10న ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితా ప్రకారం రంగారెడ్డి జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 35,23,219గా ఉన్నది. తాజాగా లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మళ్లీ ఎన్నికల సంఘం ఓటు నమోదుకు అవకాశం కల్పించగా.. కొత్తగా 68,768 మంది ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నారు. ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం ఓటర్లు 35,57,415 ఉండగా.. అందులో పురుషులు 18,39,207 మంది, మహిళలు 17,17,763 మంది, ఇతరులు-445 మంది ఉన్నారు.

**పెరుగుతున్న ఓటర్లు..**

రంగారెడ్డి జిల్లాలో ఓటర్ల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత చాలా మంది కొత్త ఓటర్లు నమోదయ్యారు. గత నెల 8న ముసాయిదా జాబితాను ప్రచురించగా ..గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో జరుగని ప్రక్షాళన ఈ విడుతలో చేపట్టారు. ఒకే రకంగా ఉన్న రెండు ఫొటోలు, ఒకే పోలికతో ఉన్న ఇద్దరు వ్యక్తులు, ఒకే చిరునామా..ఇలా సాఫ్ట్‌వేర్‌తో తప్పిదాల ను గుర్తించి తొలగించారు. గత అసెంబ్లీలో ఉన్న ఓటరు జాబితాతో పోలిస్తే ప్రస్తుత జాబితాలో 68,768 మంది ఓటర్లు పెరిగారు.

**వికారాబాద్ జిల్లాలో..**

అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే వికారాబాద్ జిల్లాలో 23,692 మంది ఓటర్లు పెరిగారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో 9,60,376 మంది ఓటర్లుండగా, ప్రస్తుతం జిల్లాలో ఓటర్ల సంఖ్య 9,84,068 మంది ఓటర్లకు చేరింది. అదేవిధంగా ఓటరు ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 9,71,011 మంది ఓటర్లుండగా, తుది జాబితా ప్రకారం జిల్లాలో 13,057 మంది ఓటర్లు పెరిగారు. ముసాయిదా జాబితా అనంతరం పెరిగిన ఓటర్లలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ముసాయిదా జాబితాతో పోలిస్తే పరిగి నియోజకవర్గంలో 3902 మంది ఓటర్లు, వికారాబాద్‌లో 1574 మంది, తాండూరు లో 4198 మంది, కొడంగల్ నియోజకవర్గంలో 3390 మంది ఓటర్లు పెరిగారు. పెరిగిన ఓటర్లలో మహిళా ఓటర్లకు సంబంధించి పరిగి నియోజకవర్గంలో 2783 మంది, వికారాబాద్ నియో జకవర్గంలో 1328 మంది, తాండూరు నియోజకవర్గంలో 2818 మంది , కొడంగల్ నియోజకవర్గంలో 2550 మంది ఓటర్లు పెరిగారు.

**అన్ని చోట్ల అందుబాటులో..**



ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా తుది ఓటరు జాబితాను విడుదల చేశాం. ఎస్‌ఎస్‌ఆర్-2024 కార్యక్రమంలో భాగంగా జనవరి 22 వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది ఓటరు జాబితాను రూపొందించాం. ఈ జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ లెవల్ అధికారులు, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించే తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచుతాం.

**-శశాంక, జిల్లా ఎన్నికల అధికారి, రంగారెడ్డి కలెక్టర్**

**రంగారెడ్డి జిల్లాలో మొత్తం ఓటర్లు ఇలా..**

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | ఎన్‌ఆర్‌ఐ | సర్వీస్ ఓటర్లు | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| ఇబ్రహీంపట్నం | 1,69,713 | 1,67,298 | 36 | 32 | 55 | 3,37,134 |
| ఎల్బీనగర్ | 3,12,163 | 2,88,153 | 134 | 52 | 50 | 6,00,552 |
| మహేశ్వరం | 2,84,913 | 2,70,996 | 69 | 59 | 73 | 5,56,110 |
| రాజేంద్ర నగర్ | 3,10,863 | 2,88,684 | 38 | 102 | 91 | 5,99,778 |
| శేరిలింగంపల్లి | 3,95,460 | 3,52,069 | 144 | 34 | 50 | 7,47,757 |
| చేవెళ్ల | 1,35,261 | 1,33,820 | 06 | 05 | 74 | 2,69,166 |
| కల్వకుర్తి | 1,22,805 | 1,20,148 | 09 | 02 | 134 | 2,43,098 |
| షాద్‌నగర్ | 1,19,114 | 1,19,211 | 13 | 0 | 54 | 2,38,392 |
| మొత్తం | 18,50,292 | 17,40,379 | 449 | 286 | 581 | 35,91,987 |

# ప్రభుత్వ భూములపై నజర్

**భూ ఆక్రమణలకు చెక్ పెట్టేలా రంగారెడ్డి కలెక్టర్ చర్యలు**

**ఇప్పటికే రూ.కోట్ల విలువైన భూములు మాయం**

**ప్రభుత్వ భూముల తాజా పరిస్థితిని తేల్చాలని రెవెన్యూ అధికారులకు ఆదేశం**

**గ్రామాల వారీగా లెక్కలు తీసే పనిలో అధికారులు**



రంగారెడ్డి, ఫిబ్రవరి 7(నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లాలో భూములకు డిమాండ్ పెరగడంతో కబ్జాదారులు ప్రభుత్వ భూములపై కన్నేస్తున్నారు. చివరకు గుట్టలను సైతం వదలడం లేదు. ఫలితంగా జిల్లాలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు హారతి కర్పూరంలో కరిగిపోతున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో కలెక్టర్ శశాంక ప్రభుత్వ భూములపై ప్రత్యేక నజర్ పెట్టారు. వాటి పరిరక్షణ దిశగా చర్యలకు ఉపక్రమించారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ భూముల లెక్కలను తేల్చాలని రెవెన్యూ శాఖకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 7 మండలాల్లోని 604 రెవెన్యూ గ్రామాల వారీగా లెక్కలు తీసే పనిలో తహసీల్దార్లు నిమగ్నమయ్యారు. ఇప్పటివరకు కబ్జా అయిన భూములతోపాటు అన్ని రకాల ఖాళీ ప్రదేశాలను గుర్తిస్తున్నారు.

**పటిష్ట కార్యాచరణతో భూముల గుర్తింపు..**

ప్రభుత్వ భూముల గుర్తింపు కోసం తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులు, సర్వేయర్లు మండలాల వారీగా సమావేశమై యాక్షన్ ప్లాన్ రూపొందించుకున్నారు. రెవెన్యూ గ్రామాల వారీగా ఈ ప్రక్రియ నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకున్నారు. రికార్డుల ప్రకారం కేటగిరీలవారీగా ప్రభుత్వ భూములను గుర్తిస్తున్నారు. ప్రభుత్వ, పోరంబోకు, బంచరాయి, శిఖం, సీలింగ్, భూదాన్, ఆలయ ఇతరత్రా భూములన్నింటినీ క్షుణ్ణంగా రికార్డుల్లో పరిశీలిస్తున్నారు. ఏ సర్వే నంబర్‌లో ఎంత భూమి ఉంది? ఎంత మేర ఆక్రమణకు గురైంది? ఇంకా ఎంత ప్రభుత్వ భూమి మిగిలి ఉంది? అన్న అంశాలను ఓ ఫార్మాట్‌లో నమోదు చేస్తున్నారు. వివరాలు సమగ్రంగా ఉండేలా తహసీల్దార్లు, ఆర్డీవోలు ఈ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రక్రియ జిల్లాలో యాభై శాతానికి పైగా పూర్తయినట్లు తెలిసింది.

**జియోట్యాగింగ్‌తో హద్దుల ఖరారు..**

ఇకపై ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టే దిశగా అధికార యంత్రాంగం సమాయత్తమవుతున్నది. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న కబ్జాదారులపై కలెక్టర్ శశాంక ఉక్కుపాదం మోపుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అక్రమ నిర్మాణాల కూల్చివేత వంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తున్నారు. భవిష్యత్తులోనూ ఇదే రీతిన కఠినంగా ఉండాలని తహసీల్దార్లకు కలెక్టర్ సూచిస్తున్నారు. ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ పూర్తయ్యాక వాటిని నిషేధిత జాబితాలో పెట్టి అక్రమ రిజిస్ట్రేషన్లకు చెక్ పెట్టనున్నట్లు తెలుస్తున్నది. అలాగే జియోట్యాగింగ్‌తో హద్దులను ఖరారు చేసే దిశగా పరిశీలన చేస్తున్నట్లు తెలిసింది. దీనివల్ల భూములను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు కార్యాలయాల నుంచి కంప్యూటర్ ద్వారా తెలుసుకునే వీలు కలుగుతుంది. తద్వారా భూ ఆక్రమణకు అడ్డుకట్టపడే అవకాశముంటుంది. ప్రభుత్వ భూములు ఉన్న చోట ప్రస్తుతానికి బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. విలువైన భూముల చుట్టూ భవిష్యత్తులో ఫెన్సింగ్ సైతం ఏర్పాటు చేసే ఆలోచనలో అధికారయంత్రాంగం ఉన్నది. అలాగే లెక్క తేలిన ప్రభుత్వ భూములను ప్రజల అవసరాలకు వినియోగించే ప్రతిపాదనను సైతం జిల్లా అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

# హెచ్‌ఎండీఏ ప్లానింగ్‌కు బిగుస్తున్న ఉచ్చు

**శివబాలకృష్ణ ఆదేశాల మేరకే నివేదికలు**

**అధికారుల్లో ఏసీబీ విచారణ గుబులు**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ) : ఆదాయానికి మించి ఆస్తుల కేసులో అరెస్టయిన శివ బాలకృష్ణ విచారణ పూర్తయింది. విచారణ సమయంలో ఏసీబీ అధికారులు 4 రోజుల పాటు అమీర్‌పేటలోని స్వర్ణజయంతి కాంప్లెక్సులో ఉన్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. కీలకమైన పత్రాలు జిరాక్స్ తీసుకోవడంతో పాటు కొన్నింటినీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకున్నారు. కాగా 4 రోజుల పాటు జరిగిన ఏసీబీ విచారణ, అనుమతుల పత్రాల పరిశీలన తర్వాత హెచ్‌ఎండీఏ ప్రణాళిక విభాగంలో బాలకృష్ణ ఆదేశాలకు అనుగుణంగా పలువురు అధికారులు పనిచేసినట్లు గుర్తించినట్లు సమాచారం. ఇప్పటి వరకు భారీ బహుళ అంతస్తుల భవనాల అనుమతులు, గేటెడ్ కమ్యూనిటీ లేఅవుట్లకు ఇచ్చిన అనుమతుల పత్రాలను ఏసీబీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కొన్ని అనుమతుల పత్రాల్లో అప్రోచ్ రోడ్లు నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో హైరైజ్ భవనాలకు అనుమతులు ఇచ్చారని, అలాంటి ఫైళ్ల ద్వారా కోట్ల రూపాయలు చేతులు మారినట్లు గుర్తించారు. క్షేత్ర స్థాయిలో ప్లానింగ్ ఆఫీసర్‌తో పాటు ఏపీవోలు, జేపీవోలు తనిఖీ చేసి నివేదికను రూపొందించాల్సి ఉన్నా, డైరెక్టర్‌గా ఉన్న బాలకృష్ణ చెప్పినట్లుగా నివేదికలు ఇచ్చినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఎండీఏ డైరెక్టర్ కింద పనిచేసిన కొందరు అధికారులను కూడా ఏసీబీ అధికారులు విచారించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. శివ బాలకృష్ణ విచారణ పూర్తయే వరకు హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారులు కంటి మీద కునుకు లేకుండా గడపాల్సిన పరిస్థితి నెలకొంది.

# జ్ఞాన తెలంగాణ నిర్మాణానికి..

### సాధనంగా హైదరాబాద్ బుక్ ఫెయిర్

**ఎన్టీఆర్ స్టేడియంలో 365 స్టాల్స్‌తో ఏర్పాటు**

**నేడు ప్రారంభించనున్న మంత్రి జూపల్లి కృష్ణారావు**



సిటీబ్యూరో, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ) : 36వ హైదరాబాద్ జాతీయ పుస్తకాల ప్రదర్శన ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం నుంచి కొలువుదీరనున్నది. లక్షలాదిగా పుస్తక ప్రేమికులు తరలొచ్చే ఈ బుక్ ఫెయిర్‌లో 365 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్టు హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీ శంకర్ తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పుస్తక ప్రదర్శన సాయంత్రం 5 గంటలకు ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభిస్తారని తెలిపారు. ఆత్మీయ అతిథులుగా సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామ్ అయ్యర్, విశ్రాంత సుప్రీం కోర్టు న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పద్మశ్రీ కూరెళ్ల విఠలాచార్య, తెలంగాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, విమలాగద్దర్ పాల్గొంటారని తెలిపారు. జ్ఞాన తెలంగాణ నిర్మాణానికి పుస్తక ప్రదర్శనలను సాధనాలుగా తయారు చేస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8:30 గంటల వరకు పుస్తక ప్రదర్శన ఉంటుందని చెప్పారు. శని, ఆదివారాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఈ పుస్తక ప్రదర్శన ప్రాంగణానికి ప్రజాయుద్ధనౌక గద్దర్ పేరును, వేదికకు సంస్కృతం పండితుడు రవ్వా శ్రీహరి పేర్లను నామకరణం చేస్తున్నట్టు చెప్పారు. ద్వారానికి ఉర్దూ దిన పత్రిక సియాసత్ మాజీ ఎండీ జహీరుద్దీన్ అలీఖాన్ పేరు పెడుతున్నట్టు తెలిపారు. పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో తెలంగాణ అమరవీరుల స్మారకస్థూపాన్ని పెడుతున్నామని చెప్పారు. ఓ స్టాల్‌కు ఇటీవల మరణించిన జర్నలిస్టు నర్సింగ్ రావు పేరు నామకరణం చేసినట్టు వివరించారు. బాలప్రపంచం పేరుతో పిల్లలకు పెయింటింగ్, క్విజ్, సంగీతం తదితర పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పిల్లలు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులకు ఉచిత ప్రవేశం ఉంటుందని చెప్పారు. అనంతరం హెచ్‌బీఎఫ్ కార్యదర్శి ఆర్.వాసు మాట్లాడుతూ.. గతంలో మాదిరిగా నిర్వహణకు సరిపడా బడ్జెట్ లేదని చెప్పారు. ఉపాధ్యక్షులు నారాయణ రెడ్డి, చంద్రమోహన్, సంయుక్త కార్యదర్శి శోభన్ బాబు, కార్యవర్గ సభ్యులు సూరిబాబు, బాల్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి పాల్గొన్నారు.

**ప్రతిరోజూ సాయంత్రం 6గంటలకు సాహిత్య కార్యక్రమాలు..!**

- ఫిబ్రవరి 10 -గద్దర్ యాదిలో..
- 11 -బాలసాహిత్యంపై సెమినార్
- 12 - దళిత బహుజన తాత్వికత-పరామర్శ
- 13 - రవ్వా శ్రీహరి రచనలు-విహంగ వీక్షణం
- 14 - నేటి నాగరిక పరిణామం-రచయితల స్పందన
- 15 - సాహిత్య విమర్శకులు సంగిశెట్టి శ్రీనివాసరావుతో ముఖాముఖి
- 16 - యువతరం కవుల అంతరంగ ఆవిష్కరణ
- 17 - కథలో నా పయనం-పెద్దింటి అశోక్ కుమార్ ముఖాముఖి
- 18 - నాటకంలో నా ప్రయాణం-శ్రీనివాస్‌తో ముఖాముఖి
- 19 - పి.శివశంకర్ ఆత్మకథ-అదొక్కటే ఏవగింపుపై చర్చాకార్యక్రమం